పేటలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- తాగునీటి సరఫరా లోపభూయిష్టం
- పట్టించుకోని అధికారులు
- డ్రెయిన్లలో వ్యర్థాలను తొలగించని వైనం
- అంటువ్యాధులు ప్రబలుతాయని భయపడుతున్న ప్రజలు


పట్టణంలో ఏ వార్డులో చూసినా ఇదే పరిస్థితి

జగ్గయ్యపేట అర్బన్: స్వచ్ఛ జగ్గయ్యపేట, క్లీన్ సిటీ చేస్తామంటూ చెబుతున్న నేతల మాటలు ఆచరణలో క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలవడం లేదు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా విషయంలో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఈ సమస్యలకు సంబంధించి కౌన్సిల్‌లో ప్రతి మీటింగ్‌లో సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారుల పని తీరును ఎండగడుతూనే ఉన్నారు. పట్టణంలో ఇటీవల డయేరియా విజృంభించి పలువురు ప్రాణాలు కోల్పోయినప్పటికీ, మున్సిపల్ పాలకవర్గం పనితీరులో ఎటువంటి మార్పు లేదు. డ్రెయిన్లలో చెత్త, వ్యర్థాలను తొలగించకపోవడంతో వాటి నుంచి వస్తున్న దుర్వాసన భరించలేక పోతున్నామంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డుల్లో ప్రజలు కొందరు తమ గృహాలలో వినియోగించిన చెత్త, వ్యర్థాలను రోడ్లపై కుప్పగా పడవేస్తున్నారు. ఈ చెత్త కుప్పలను గానీ, డ్రెయిన్ల నుంచి బయటకు తీసిన వ్యర్థాలను కానీ పారిశుద్ధ్య సిబ్బంది వెంటనే తొలగించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎర్రకాలువ కూడా వ్యర్థాలతో నిండిపోయి, దోమలు వృద్ధి చెంది అంటువ్యాధులకు కేంద్రంగా మారింది.

➡ జగ్గయ్యపేట పట్టణంలో 60 వేలకు పైగా జనాభా ఉండగా, పురపాలక సంఘ పరిధిలో 31 వార్డులు, 14 సచివాలయాలు ఉన్నాయి. పట్టణ ప్రజలు ఉపయోగించిన చెత్త, వ్యర్థాలు సుమారు 26 టన్నులు బయటకు వస్తుండగా, దానిలో తడి చెత్త 14 టన్నులు, పొడి చెత్త 12 టన్నుల వరకు ఉంటుంది. పారిశుద్ధ్య కార్మికులు, వాహనాల డ్రైవర్లు కలిపి మొత్తం 159 మంది ఉండగా, వారిలో 14 మంది పర్మినెంట్, 145 మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి చెత్తను ఎత్తి దూరంగా తీసుకెళ్లేందుకు 3 ట్రాక్టర్లు, ఒక పెద్ద కంపాక్ట్, ఒక చిన్న కంపాక్ట్ , ఒక లోడర్(చిన్న జేసీబీ), రెండు ఆటోలు ఉన్నాయి.

➡ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్మికులపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ గానీ, కమిషనర్ గానీ చర్యలు తీసుకోలేకపోతున్నారు. అందుకు కారణం కార్మికులు వారికి సంబంధించిన రాజకీయ నాయకులతో పైరవీలు చేయించడమే. కొందరు హాజరు వేయించుకుని వెళ్లి రాజకీయ నాయకుల ఇళ్లలో పనిచేస్తున్నప్పటికీ ఎవరూ ఏమీ చర్యలు తీసుకోలేకపోతున్నారు.


క్రిస్టియన్‌పేటలో వృథాగా పోతున్న తాగునీరు

పూర్తిగా వినియోగం కాని కృష్ణా జలాలు

కృష్ణా జలాలు పట్టణ ప్రజలకు సరఫరా చేస్తున్నామని నాయకులు అంటున్నారు గానీ, అవి పేరుకే పరిమితం అయ్యాయి. 31 వార్డుల్లో దాదాపు సగం వార్డుల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. దాదాపు 40 ఏళ్ల క్రితం భూమిలో వేసిన పైపులైన్ వ్యవస్థ శిథిలావస్థకు రావడంతో పట్టణంలో తరచూ ఎక్కడో ఒకచోట లీకేజీలు అవుతున్నాయి. దీంతో నిరంతరం ఇంజినీరింగ్ సిబ్బంది లీకులు మరమ్మతు చేయడంలోనే నిమగ్నమవుతున్నారు. ఉన్న నీరు అయినా ప్రజలకు సక్రమంగా అందిస్తున్నారంటే.. అదీ లేదు. వీధి కుళాయిలకు కనీసం ఆఫ్, ఆన్‌లు వేసే పరిస్థితి కూడా లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో తాగునీరు వృథాగా పోతోంది. ఇది ఇంజినీరింగ్ సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనం. ఒకటవ వార్డులో ఎన్టీఆర్ విగ్రహం దగ్గర ప్రధాన పైపులైన్ లీకయి రెండు నెలలుగా నీరంతా వృథాగా పోతోంది. ఈ విషయమై స్థానికులు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోవడం లేదు.

ప్రతి మీటింగ్‌లో ఫిర్యాదు చేస్తూనే ఉన్నాం



ప్రతి కౌన్సిల్ మీటింగ్‌లో పారిశుద్ధ్య గురించి ప్రస్తావిస్తూనే ఉన్నాం. పైపులైన్లు లీకేజీలతో సక్రమంగా తాగునీటి సరఫరా జరగడం లేదు. డ్రెయిన్లలో వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది.

–వట్టెం మనోహర్, మున్సిపల్ కౌన్సిలర్

నా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటా



నేను ఇటీవలే బదిలీపై వచ్చాను. పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య, ఇతర ఏ సమస్యలు ఉన్నా వెంటనే నా దృష్టికి తీసుకువస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటా.

–ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి



గరికపాడు(జగ్గయ్యపేట): రైతులు వ్యవసాయంలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించుకోవాలని జాతీయ పత్తి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త భాగ్యలక్ష్మి అన్నారు. గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం రైతులతో కలిసి పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే రైతులు పురుగు మందులను పిచికారీ చేయాలన్నారు. ముఖ్యంగా లింగాకర్షక బుట్టల ద్వారా పురుగు ఉధృతిని అంచనా వేయచ్చని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్.రాజశేఖర్, శోభితరాణి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ లడాయితో కప్పిపుచ్చుకున్న వ్యతిరేకత

కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకుడు ముప్పా మోహనరావు

నందిగామటౌన్: సూపర్ సిక్స్ పథకాలన్నీ బోగస్ అని, తిరుపతి లడ్డూ పేరుతో లడాయి చేసి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకుడు ముప్పా మోహనరావు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలను చూస్తుంటే భయమేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీని పటిష్టపరిచే బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్, నాయకుడు రేపాల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచిన నలుగురిపై కేసు

కంచికచర్ల: మండలంలోని పరిటాల గ్రామంలో శ్రీలక్ష్మీ గణపతి రైస్‌మిల్లును లీజుకు తీసుకుని 104 టన్నుల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బోనగిరి రాజు బుధవారం తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం రైస్ మిల్లులో అక్రమంగా 104 టన్నుల రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్టు గుర్తించారని తెలిపారు. ఆ బియ్యాన్ని సీజ్ చేశామని, నిల్వ ఉంచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేద పండితుడిపై సస్పెన్షన్ వేటు

పెనుగంచిప్రోలు: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మవారి ఆలయంలో వేద పండితుడుగా పని చేస్తున్న ఎం.కిరణ్‌శర్మను సస్పెండ్ చేస్తూ బుధవారం ఆలయ ఈవో కిషోర్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన కారణంగానే ఈ చర్యలు తీసుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. వారం రోజుల్లో దీనిపై వివరణ ఇవ్వమని కోరినట్టు చెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



పెనుగంచిప్రోలు: ఖమ్మం జిల్లా మధుపల్లి నుంచి అక్రమంగా తరలిస్తున్న 110 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ ఎంఎస్‌కే అర్జున్ తెలిపారు. మండలంలోని అనిగండ్లపాడు గ్రామ శివారులో తనిఖీల్లో భాగంగా బుధవారం రాత్రి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. మద్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ అర్జున్ హెచ్చరించారు.

ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడిగా సామినేని

జగ్గయ్యపేట అర్బన్: ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడిగా జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్‌కల్యాణ్ నిర్ణయం మేరకు ఆయన రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ నియామకపత్రం అందజేశారు. తనను జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమించినందుకు ఉదయభాను పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

692 మంది పింఛన్‌దారులకు నోటీసులు

కంచికచర్ల: కంచికచర్ల మండలంలో డప్పు కళాకారులు, చర్మకారులకు పింఛన్ నోటీసులు పంపుతున్నామని ఎంపీడీఓ బి.వి జయలక్ష్మి బుధవారం తెలిపారు. కంచికచర్ల మండలంలో 10,308 పింఛన్‌దారులున్నారని వారిలో డప్పు కళాకారులు, చర్మకారుల పింఛన్‌దారులున్నారని తెలిపారు. వీరంతా పింఛన్ పొందుటకు అర్హత ఉన్నదా లేదా అని ఇటీవల గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించామని, వారిలో 692 మందిపై ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వారిలో డప్పు కళాకారులు 207 మంది, చర్మకారులు 485 మంది ఉన్నారని తెలిపారు. వారికి నోటీసులు ఇచ్చి, అనంతరం ఆ నివేదికను జిల్లా స్థాయి అధికారులకు పంపుతామని ఎంపీడీఓ తెలిపారు.

సామాజిక తనిఖీపై కోఆర్డినేటర్ల సమావేశం

వీరులపాడు: 2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన రూ.14 కోట్ల పనులకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీలలో సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కార్యాలయ ఏవో రాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీకి సంబంధించి బుధవారం కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పనులు, గ్రామ సచివాలయ భవనాలు, సీసీ రోడ్లు తదితర అంశాలపై సామాజిక తనిఖీ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సీతారామరాజు, ఎస్ఆర్‌పీ బండారు సూర్యనారాయణ, ఏపీవో జనార్దన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో నితిన్

బలుసుపాడు(జగ్గయ్యపేట): సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ జి.నితిన్ హెచ్చరించారు. గ్రామంలోని సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తాగునీటి ట్యాంక్‌లను క్లోరినేషన్ చేయించాలన్నారు. బయోమెట్రిక్‌ను విధిగా వేయాలన్నారు. కొన్ని గ్రామాల్లో సిబ్బంది విధులకు వచ్చి బయోమెట్రిక్ వేసి వెళుతున్నారని వారిపై ప్రత్యేక నిఘా కూడా పెట్టామన్నారు. అనంతరం గ్రామంలో తాగునీటి బోరులను పరిశీలించి పనిచేయని వాటి స్థానంలో కొత్త బోరులు ఏర్పాటు చేయాలని కార్యదర్శి చంద్రశేఖర్‌ను ఆదేశించారు. అనంతరం గౌరవరం గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించి సిబ్బందిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.

సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ

గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో జిల్లాలోని వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై ఈ నెల 16 నుంచి 30 వరకు జరగనున్న సర్టిఫికెట్ కోర్సు శిక్షణ కార్యక్రమాన్ని ప్రోగ్రాం కో ఆర్డినేటర్ అచ్యుతరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్సులో భాగంగా సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కోర్సు అధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త కృష్ణంరాజు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ భవానీదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి బాటలు వేసేలా పాలన


సోమవరంలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్

నందిగామ టౌన్: రాష్ట్ర ప్రగతికి బాటలు వేసేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని నందిగామ, జగ్గయ్యపేట ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్ అన్నారు. పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాఘవాపురం, పల్లగిరి, కమ్మవారిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే సౌమ్య, గోళ్లమూడి, సోమవరం, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ బుధవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మౌలిక వసతులు కల్పించటంతో పాటు గ్రామాలను అభివృద్ధి చేసేలా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త తంబళ్లపల్లి రమాదేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తోట నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పనులు చేపట్టాలి

- మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి
- వీవోఏలను విధుల్లోకి తీసుకోవటం లేదని సభ్యుల ఆగ్రహం


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి

జుజ్జూరు(వీరులపాడు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను గ్రామ పంచాయతీ నిబంధనల ప్రకారం చేపట్టాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినంత మాత్రాన గ్రామ పంచాయతీలకు భారత రాజ్యాంగం కల్పించిన అధికారాలు, బాధ్యతలు మారవన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నూతనంగా చేపట్టే పనులను గ్రామ పంచాయతీల హక్కులను కాలరాసేలా కాకుండా నిబంధనల ప్రకారం చేపట్టాలని కోరారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

పలు తీర్మానాలకు ఆమోదం

గతంలో పని చేసిన బుక్ కీపర్‌లను (వీవోఏ) విధుల్లోకి తీసుకోవాలని చేసిన తీర్మానాన్ని సభ్యులు ఆమోదించినట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.29.50 లక్షల వ్యయంతో 25 బోర్ల ఏర్పాటు, ఆయా గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ఒక్కో ఎంపీటీసీ సభ్యునికి రూ.రెండు లక్షలు మంజూరు చేయటంతో పాటు పలు తీర్మానాలకు సభ్యులు ఆమోదం తెలిపారని చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు షేక్ నాగుల్‌మీరా, వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యులు శీలం రమణారెడ్డి, తోట నారాయణరావు, మోండ్రు బాయమ్మ, యాదాల సుజాత, తమ్మిశెట్టి వరలక్ష్మి, వేమిరెడ్డి కోటేశ్వరి, బండి సీతామహాలక్ష్మి, తహసీల్దార్ హుస్సేన్, వైద్యాధికారులు దీపిక, గౌతమ్, ఎంఈవో పాల్ కెనడి, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలున్నా విధుల్లోకి తీసుకోరా?

గతంలో పని చేసిన బుక్ కీపర్‌లను యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినా వారిని విధుల్లోకి ఎందుకు తీసుకోవటం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు ఏపీఎం యెహోషువాను నిలదీశారు. గ్రామాలలో జరిగే అభివృద్ధి పనుల కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులకు కనీస సమాచారం అందించటం లేదని ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎంపీడీవో అరుంధతీ దేవి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా ఉండేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

తెల్లబోతున్న తెల్ల బంగారం

- గిట్టుబాటు ధర దక్కని పత్తి రైతు
- పెరిగిన ఖర్చులు..తగ్గిన దిగుబడులు
- అధిక వర్షాలే కారణమంటున్న రైతులు
- వర్షపు జల్లులతో దెబ్బతింటున్న పత్తి


వర్షాలకు దెబ్బతిన్న పత్తి

పెనుగంచిప్రోలు: పత్తి పంట సాగు చేసిన రైతులు తెల్లబోతున్నారు. ఖర్చులు పెరగటంతో పాటు దిగుబడి తగ్గటంతో రైతుకు కనీసం గిట్టుబాటు ధర వచ్చే పరిస్థితి లేదు. ఇటీవల వచ్చిన తుపాన్లు, వరదలకు పత్తి పంట బాగా దెబ్బతింది. దీంతో వేలాది రూపాయల పెట్టుబడులు కృష్ణార్పణమయ్యాయి. పత్తి పూత దశలో వర్షానికి పూత రాలిపోవటంతో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. వర్షం తగ్గిన తరువాత రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకుందామంటే చీడపీడలు ఆశించి దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. వర్షాలకు మొక్క ఎదుగుదల పూర్తిగా లోపించింది. ఉన్న కొద్ది పంటను కాపాడుకుందామంటే తుఫాన్ ప్రభావంతో జల్లులు పడుతుండటంతో ఉన్న పత్తి కూడా రాలిపోయి పాడైపోతోందని రైతులు వాపోతున్నారు.

ఆందోళనలో రైతులు...

నియోజకవర్గంలో జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో ఈఏడాది 6,600 హెక్టార్లలో పత్తి సాగు చేయగా తుఫాన్ ప్రభావంతో 453 హెక్టార్లలో పూర్తిగా నష్టపోయింది. ఉన్న పంట కూడా అంతంతమాత్రమే. దీంతో ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి 3 నుంచి 5 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికే రైతులు ఎకరానికి రూ.30 నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టారు. కౌలు రైతులయితే ఎకరానికి రూ.20 నుంచి రూ.25 వేల వరకు కౌలు అదనంగా నష్టపోవాల్సి వస్తోంది. దీంతో రైతులు ఆందోళనకు గురౌతున్నారు.

పత్తి తీసేందుకు క్వింటాకు రూ.2వేలకు పైగా ఖర్చు

క్వింటా పత్తి తీసేందుకు రైతుకు రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు ఖర్చు వస్తోంది. అసలే దిగుబడులు లేక, ధర లేక దిగులుగా ఉన్న రైతులకు కూలీ ఖర్చు కూడా మోయలేని భారంగా మిగిలింది. పత్తిని తీసేందుకు కూలీల కొరత వేధిస్తోంది. అవసరమైతే ఇతర ప్రాంతాల నుంచి కూడా కూలీలను తీసుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక పక్క మబ్బులు పట్టి జల్లులు పడుతుండటంతో వచ్చిన కొద్దిపాటి పత్తిని రక్షించుకునేందుకు అన్నదాతలు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు.

ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.7,520

పత్తికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.7,520గా నిర్ణయించిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం పత్తి కొనుగోళ్లకు సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయక పోవటంతో దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. క్వింటాకు రూ.5 వేల నుంచి రూ.5,800 వరకు విక్రయిస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. సీసీఐ కేంద్రాలను ప్రారంభించక పోవటంతో రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. సీసీఐ కేంద్రాలను దీపావళి తరువాత ప్రారంభిస్తామని మార్కెటింగ్ శాఖ అధికారులు అంటున్నారు. తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున దళారులు వచ్చి పత్తిని కొనుగోలు చేస్తున్నారు.

వర్షాలకు బాగా దెబ్బతింది



అధిక వర్షాలకు తోడు వరదలకు పత్తి పంట బాగా దెబ్బతింది. 5 ఎకరాలు కౌలు కు తీసుకుని పత్తి సాగు చేశా. ఎకరానికి రూ.30 వేలకు పైగా ఖర్చు అయింది. కౌలు ఎకరానికి రూ.20 వేలు ఉంది. దిగుబడి ఎకరానికి 5 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. దళారులు కూడా తేమ శాతం ఎక్కువగా ఉందని ధర తగ్గిస్తున్నారు.

–రాము, కౌలురైతు, లింగగూడెం

సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలు త్వరితగతిన ఏర్పాటు చేయాలి. నాకు ఉన్న ఎకరంతో పాటు 3 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. క్వింటా పత్తికి గిట్టుబాటు ధర రూ.7,520 ఉన్నా దళారులు రూ.5 వేల నుంచి రూ.5,500కు అడుగుతున్నారు. సీసీఐ కేంద్రాల్లో తేమ శాతం అంటూ కటింగ్ చేయకుండా ఉండాలి.

–కూచి శ్రీనివాసరావు, రైతు, వెంకటాపురం

గండేపల్లి- కీసర రోడ్డుకు మరమ్మతులు


గండేపల్లి కీసర రోడ్డుపై పడిన గోతులను పూడ్చివేయిస్తున్న సెంటిని కర్మాగార ప్రతినిధులు

కీసర(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి నుంచి కీసర వెళ్లే రోడ్డంతా పెద్దపెద్ద గోతులు పడి గతుకులమయంగా మారింది. ఇటీవల కుండపోతగా కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్డంతా గోతులు పడటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై స్పందించిన గండేపల్లిలోని సెంటిని కర్మాగార యాజమాన్యం రోడ్డుపై పడిన గోతులను తమ కార్మికులతో పూడ్చించారు. కీసర రైస్‌మిల్లు వద్ద, మహాలక్ష్మీ అమ్మవారి దేవాలయం వద్ద పడిన గోతులను కంకర, ఫ్లైయాష్‌తో పూడ్చివేశారు. సెంటినీ కర్మాగార యాజమాన్యం రోడ్డుపై పడిన గోతులను పూడ్చినందుకు గండేపల్లి, కీసర గ్రామాల ప్రజలు సెంటినీ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సెంటినీ ప్రతినిధులు శ్రీనివాసరావు, సతీష్, సురేష్, గ్రామస్తులు మధుబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



జయంతిపురం (జగ్గయ్యపేట): నిరుద్యోగులు వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని రామ్‌కో సంస్థ ప్రెసిడెంట్ ఆశిష్ కుమార్ శ్రీవాత్సవ అన్నారు. మండలంలోని బూదవాడ గ్రామానికి చెందిన 10 మంది నిరుద్యోగులు రామ్‌కో సంస్థ సహకారంతో ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన సందర్భంగా వారిని బుధవారం కర్మాగారంలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌లోని జీఎంఆర్ నైపుణ్య శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 10 మంది నిరుద్యోగులకు మూడు నెలల పాటు శిక్షణ ఇప్పించామన్నారు. ఇటీవల శిక్షణ పూర్తయి పలు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. కార్యక్రమంలో జీఎం ఫరూఖ్ మహ్మద్, మైన్స్ జీఎం జానిరెడ్డి, డీజీఎం రామకృష్ణ సాయి, సిబ్బంది పాల్గొన్నారు.